# అదృష్టం

"ఏక్ కప్ చాయ్ లావ్."

పరిచిత కంఠం వినపడగానే వులిక్కిపడి తిరిగి చూశాడు వాసు.

ఖాసిం!... ఖాసిమేనా?

వాసు హృదయం ఆగి, కొట్టుకో సాగింది తీవ్రంగా. చేతులు వణికాయి; ఓ చేతిలోని మైసూర్ బోండా, రెండో చేతిలోని నీళ్ళు తొణికిస లాడాయి. చూస్తున్న వాడు చూస్తున్నట్టు గానే నిలబడి పోయాడు నిశ్చేష్టగా.

"ఏ అయ్యర్! తీసుకురావేం?" ఓ మహాశయుడు గదమాయించాడు

ఆ దెబ్బకు తేరుకున్నాడు వాసు. చప్పున ఆ బోండా ప్లేటూ, నీళ్ళ గ్లాసూ ఆయన ముందు పెట్టొచ్చి, మళ్ళీ ఖాసింని చూట్టం మొదలెట్టాడు.

ఖాసిమేనా...? కాని, ఈ వేషమేమిటి? బ్లూబ్లేజర్ కోటూ, తెల్ల సిల్కు ఇన్‌షర్ట్, తెల్లపొట్టి నెక్కర్, మెడకు మఫ్లర్, కళ్ళకు నల్ల కళ్ళద్దాల జోడు, కాళ్ళకి సాక్సూ, షూజూ. ఉంగరాలు ఉంగరాలు గల జుత్తును బాగా ఎగ దువ్వాడు. కుడి మోచేయి టేబుల్ పైనవుంచి, అరచేతిలో గడ్డం ఆనించి వీధిలోకి చూస్తున్నాడు, నిశ్చలంగా. ప్రక్క కుర్చీపైన టెన్నిస్ రాకెట్ పెట్టి వుంది.

ఖాసిమేనా?... మళ్ళీ సందేహం కలిగింది వాసుకు... దగ్గరికెళ్ళి చూస్తే? పలకరిస్తే? తీరా ఖాసిమే అయి తనను గుర్తు పట్టేస్తే? .. అమ్మో, ఈ స్థితిలో తాను ఖాసిం ఎదుట పట్టమే? ఎంత అవమానం! ఛా, వద్దు...

ఖాసిం కంట పడకుండా, దూర దూరంగా వెళ్ళి ఓ పెద్ద మనిషితో, తగ్గు స్వరంలో "ఏంకావాలిసార్?" అన్నాడు వాసు. అంతసేపూ ఓ కంట ఖాసింను కని పెడ్తూనే వున్నాడు. ఆ పెద్ద మనిషి ఆర్డరివ్వక పూర్వమే

ఖాసిం మొహం ఇటు తిప్పి, "చాయ్‌లావ్," అనేసరికి, వాసు ఒక్క గెంతులో మళ్ళీ అలమారాల వెనక్కి వచ్చేశాడు. అలమారాల మధ్య సందులోంచి చూడ సాగాడు. ఖాసిం ముందు టీ కప్పు పెట్టివుంది. ఖాసిం అందులో స్పూన్ తిప్పుతున్నాడు. కాని దృష్టి మాత్రం వీధి వేపే వుంది.

ఎదుట కనిపించే క్లాక్ టవర్ గడియారంలో నాలుగూ యాభై అయింది. ఆ ప్రక్కనే హైస్కూలు గేటు కనిపిస్తోంది. అది కనిపించగానే వాసు ఆలోచనలు ఓ పది సంవత్సరాలు వెనక్కు వెళ్ళాయి...

ఆ స్కూల్లోనే తానూ, ఖాసిమూ ఆరు సంవత్సరాల పాటు జంటగా చదివింది. అక్కడే తమ స్నేహలత పుట్టింది, పెరిగింది, వేళ్ళుతన్నుకు ప్రాకింది. అవి ఎంత మంచిరోజులు! స్కూల్లో ఎంత హాయిగా గడిచేది! కాని, ఆనాటి మధుర స్మృతులతో బాటు తన గత జీవితపు చేదు నిజాలు గుర్తుకు రాగానే చివుక్కుమంది వాసు మనస్సు. చాలీ చాలని జీతంలో సగానికి పైగా త్రాగుడుకు అర్పితం చేసేవాడు నాన్న. అయినా అమ్మ అతి జాగ్రత్తగా సంసారనౌకను నడుపుతూ, అన్ని ఆశలూ తన మీదే పెట్టుకొని, ఫిఫ్తు ఫారం (తొమ్మిదో క్లాసు) వరకు చదివించింది. కాని ప్లేగు- ఆరోజుల్లో ప్లేగు, మహంకాళీ జాతరలా ప్రతి ఏటా వచ్చేది- వారం తిరక్కుండా అమ్మా నాన్నలిద్దర్నీ పొట్ట పెట్టుకుంది. దిక్కూ మొక్కూలేని అనాథ అయిపోయాడు వాసు.

మావయ్య వచ్చాడు. చదువుకు స్వస్తి చెప్పించి, ఇల్లు ఖాళీ చేయించి, తన వెంట తీసికెళ్ళాడు వూరికి. అక్కడ తనరాక అత్తయ్యకు ఎంతమాత్రం ఇష్టం లేదన్న సంగతి మొదటి మూడు రోజుల్లోనే తెలుసుకో గలిగాడు. తన కేదైనా ఆస్తి అనేది ఉంటే ఆప్యాయంగా చేరదీసే వారేమో. తాను వాళ్ళింటో నిలవకుండా చెయ్యగలిగినంతా చేసింది అత్తయ్య. అఖరికి ఓ రోజు మావయ్య లేనిది చూసి, తన కొడుకును కొట్టాడన్న నెపం మీద చెడామడా తిట్టి చెయ్యికూడా చేసుకుంది. దాంతో హడలెత్తిపోయి, అదే రాత్రి ఎవరికీ తెలీకుండా వెళ్ళి రైలెక్కాడు వాసు.

టిక్కెట్టు లేకుండానే ప్రయాణించేస్తూ, మధ్యలో పది సార్లయినా దించేసినా, పట్టువదలకుండా, ఎల్లాగో అల్లాగ బొంబాయి చేరుకున్నాడు.

అక్కడ వాసు పడ్డ పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఇరానీ హోటల్లో టేబుళ్ళు తుడిచాడు. పత్రికలమ్ముతూ తిరిగాడు. బూట్లకు పాలిష్ వేశాడు. స్కూళ్ళకు పుస్తకాలూ, ఆఫీసులకు అన్నాలూ మోశాడు. రైల్వే స్టేషన్లలో మూటలు మోశాడు. సినిమా స్టూడియోల్లో చాయ్‌లూ, సిగరెట్లూ అందించాడు. .. ఇంతా చేసినా ఏ పూటకాపూటకు సరిపోయేదికాదు. పస్తుండటం, తిట్లు తినటం బాగా అలవడిపోయినాయి. ఆఖరికి తొమ్మిదేళ్ళ తర్వాత, విసుగెత్తి హైద్రాబాద్‌కు తిరిగి వచ్చేసినప్పుడు జేబులో ఎర్రని ఏగాణి లేదు.

రెండు రోజులు తిరిగి తిరిగి, బొంబాయిలో అడుగు పెట్టగానే తెంపి పారేసిన జంధ్యం మళ్ళీ తగిలించుకుని, ఈ అయ్యర్ హోటల్లో సర్వర్‌గా చేరగలిగాడు. ఇది మాత్రం ఏంశాశ్వతం? మళ్ళీ విధి ఎటు తన్నుకు పోతుందో ఏమో! ఒక వేడి నిట్టూర్పు విడిచాడు వాసు.

గడియారం నాలుగు పావులూ, అయిదు గంటలూ కొట్టింది. ఖాసిం తన ఎడమచేతి కోటు కప్పు తొలగించి రిస్టు వాచ్‌లో టైం చూసుకున్నాడు. టీ పూర్తయింది. జేబులోంచి గోల్డ్ ఫ్లేక్ సిగరెట్ తీసి ముట్టించాడు. పొగ వదులుతూ, హైస్కూల్ కేసే చూస్తూ కూచున్నాడు.

ఏమిటో ఆ ఆలోచన్లు? తన పాత జీవితం జ్ఞాపకమొస్తోందా?... రంగు వెలసిన శేర్వానీ, మాసికలు వేసిన లాగూ, బాగామైల పడ్డ రూమిటోపీ (టర్కిష్ క్యాప్)... అప్పటి ఖాసింకూ ఇప్పటి ఖాసింకూ ఎంత తేడా! అసలు ఇతను ఖాసిమే కాడేమో... కాని, ఆ కంఠం? నూరు మందిలోనైనా, ఆ కంఠం వల్ల ఖాసింను ఇట్టే పోల్చుకోగలనన్న ధీమా వాసు కుంది. ఎంత మధుర కంఠం అది! తానే ఓ సారి అన్నాడు, "ఒరే ఖాసిం! నీ కంఠంలో రవ్వ పలుకుతుందిరా. నువ్వే గనక సంగీతం నేర్చావా, గొప్పగవయ్యా (సంగీత విద్వాంసుడు) వైపోతావురా ." అవి. నిజంగానే ఇప్పుడు ఖాసిం గవయ్యా అయిపోయాడేమో, లేదా సినిమా ప్లేబాక్ సింగర్ అయిపోయా



కథా నిలయం
3729

డేమో, లేదా ఏ డర్బీ పందెమైనా కొట్టేశాడేమో! అవును. ఎందుకు కాకూడ దలా? ఎవరినొసట ఎల్లా రాసుందో ఎవరికి తెలుసు?...

అరె, ఖాసిమేడీ?... మెట్లు దిగిపోతున్న ఖాసింను చూడగానే ఒక్క-సారి చురుకు పుట్టింది వాసుకు. ఖాసిం మళ్ళీ కనిపిస్తాడో లేడోనన్న తలంపు రాగానే, వాసు చప్పున అల్మారాల వెనకనించి వచ్చి, చేతిలో వున్న ఖాళీ ట్రేను ఒక టేబుల్ మీద పెట్టేసి, గబగబా ఖాసింను అనుసరించాడు.

సైకిల్ పెడల్ మీద కాలు పెట్టబోతున్న ఖాసింను వెనకనించి, "సార్! సార్?" అన్న పిలుపు వినిపించగానే ఆగి, తిరిగి చూశాడు. వాసు రొప్పుతూ వచ్చి నిలబడ్డాడు.

"నువ్వేనా పిలిచింది?... ఏఁ, ఎందుకూ?" బొమలు ముడిచి అడిగాడు ఖాసిం,

"మీరు .. మీరు .." తడబడ్డాడు వాసు.

"నేను?... నేను బిల్లు పైసలు అక్కడే పెట్టేశానే?

"అదికాదు సార్!... మీరు...మీరు"

"ఆఁ, నేను?... ఏఁవిటి నేను?" కొంచెం విసుగ్గా అన్నాడు ఖాసిం.

"మీరు... మీపేరు .. ఖాసిం కదూ?"

ఖాసిం ఆశ్చర్యంగా చూస్తూ నిలబడి పోయాడు.

"అవును, నాపేరు ఖాసిమే. కాని నీకెట్లా తెలుసూ?"

వాసు జవాబు చెప్పకుండా, హైస్కూలు వేపు చూపుతూ, "పూర్వం మీరు ఆస్కూల్లో చదివే వారు కదూ?" అన్నాడు.

ఖాసిం మరీ ఆశ్చర్యంతో, "అరె, నీకెలా తెలుసూ?" అన్నాడు.

కొద్ది క్షణాలు ఆగి వాసు మెల్లిగా అన్నాడు, "మీతో పాటు ఫిఫ్త్ ఫారం దాకా వాసు అనే కుర్రాడు చదివేవాడు జ్ఞాపకముందా?"

## అదృష్టం

"వాసు? ... ఆఁ అవునవును, వాసు ... అరె, నువ్వు .. ?" వెంటనే కళ్ళజోడు తీసేసి, వాసుని తేరిపార చూస్తూ, "నువ్వు .. నువ్వు వాసువే కదూ? .." అంటూ సైకిల్ స్టాండు కెక్కించి, "అవునవును వాసువే" అంటూ వాసు చేతులు పట్టుకున్నాడు ఖాసిం. సంభ్రమాశ్చర్యాలతో మొహం విప్పారింది. వాసు మాట్లాడ కుండా ముసి ముసి నవ్వు నవ్వుతూ నిలుచుండి పోయాడు.

"అబ్బ! ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు కలుసుకున్నాం వాసూ మనం!... కాని భాయ్! ఇదేఁ వేషం?... ఎక్కడున్నావ్ ఇన్నాళ్ళూ? నీకథంతా వినాలి. రా పోదాం" అన్నాడు ఖాసిం ఉత్సాహంగా.

"ఊహుఁ, ఇప్పుడుకాదు" అంటూ హోటల్ కేసి సౌజ్ఞ చేశాడు వాసు.

"మరి నీకు తీరికెప్పుడూ?"

"వారానికి ఒక్కరోజు, సోమవారం"

"ఎల్లుండేగా? ఫరవాలేదు . ఎక్కడుంటావ్?

"హోటల్లోనే .. మేడపైన"

"అయితే మా ఇంటికేరా. అడ్రసు ఇస్తాను" అని జేబులోంచి కాగితం తీసి, అడ్రసూ, చిన్న స్కెచ్చూ రాసి వాసు చేతిలో పెట్టి, "ఇదిగో, తోప్‌కానాంచా (గన్ ఫౌండరీ) లో ఈ సందు మళ్ళితే, ఎదురుగా కనిపించేది మా ఇల్లే. ఎల్లుండి వచ్చెయి. పొద్దునే రా, అక్కడే భోంచేయి. వస్తావు కదూ? "మనం చాలా మాట్లాడుకోవాలి" అన్నాడు.

వస్తానంటూ తలూపాడు వాసు.

"తప్పకుండా రావాలి సుమా" అంటూ మళ్ళీ ఓ సారి వాసు చెయ్యి నొక్కి, సైకిల్ ఎక్కివెళ్ళి పోయాడు ఖాసిం

ఆ రాత్రీ మరుసటి రాత్రీ సరిగ్గా నిద్ర పట్టలేదు వాసుకు. ఖాసిమూ, ఖాసింను పట్టిన అదృష్టం గురించే ఆలోచిస్తూ గడిపాడు.

సోమవారం రోజున ప్రొద్దునే ఉత్సాహంగాలేచి, స్నానాదులు ముగించుకుని, తన దగ్గిర వున్న వాటిల్లో కాస్త మంచి ప్యాంటూ, బుష్షర్టూ వేసుకున్నాడు. కొలువు రోజున మాత్రం తొడిగే చెప్పులు వేసుకొని, సరిగ్గా తొమ్మిదింటికి బయలు దేరాడు.

ఖాసిం ఇచ్చిన చీటీని చేతబట్టుకొని గన్‌ఫౌండ్రీలో ఆ బంగళాను సునాయసంగానే చేరుకోగలిగాడు. ఇనుప గేటూ, దాని వెనకాల కొద్ది దూరంలో ఎత్తుగా మెట్లూ, ఇరువేపులా విశాలమైన వరండా. దానికానుకొని ఎత్తైన బంగళా. గేటు స్థంబాలపైన, ఒకదాని మీద ఉర్దూలోనూ, మరోదాని మీద ఇంగ్లీషులోనూ 'బైతుల్ మకీన్' అని చెక్కివుంది. ఖాసిం వేసిన స్కెచ్‌లోనూ ఆ ముక్కే రాసుండటం చూసి అదే ఇల్లని నిర్ధారణ కలిగింది.

లోపలికెలా వెళ్ళాలో తోచక కాసేపు తటపటాయించాడు వాసు. ఆఖరికి గేటు గొళ్ళెం తీశాడు. ఆ శబ్దానికి అమాంతంగా 'బౌ బౌ' మంటూ ఒక నల్లని పొట్టి కుక్క మెట్లమీంచి పరుగెత్తుకొచ్చింది. వాసు భయంగా ఈవలే వుండి పోయాడు. కుక్క మొరుగుతూనే వుంది. ఇంతలోకి, "సన్నీ! సన్నీ!" అంటూ ఒక స్త్రీ కుడి వేపు వరండాలోంచి వచ్చి, వాసును ప్రశ్నార్థకంగా చూస్తూ, మెట్లుదిగి, గేటు దాకా వచ్చింది. తెల్లగా, పొడుగ్గా కాస్త లావుగా వుంది. గుండ్రని మొహం. బర్మాముడి వేసుకుంది. పెదాలకు ఎరుపురంగు తెలిసీ తెలీకుండా వుంది. రంగు రంగుపూల కమీజూ, ఘాఘ్రా (పావడ) వేసుకుంది. కాళ్ళకు మఖమల్ స్లిప్పర్స్ వున్నాయి. ఒక చేతికి రెండే రెండు గాజులూ, మరోచేతికి వాచీ వున్నాయి. అందంగా హుందాగా కనిపించింది. ప్రాయం ముప్పై అయిదు నలభై మధ్యలో వుంటుంది.

"ఎవరు మీరు?" అన్నట్టు చూసింది.

"ఖాసింగారు వున్నారా?" కొంచెం బిడియంగానే అడిగాడు వాసు.

"మీ పేరు?"

"వాసు"

ఆమె వెంటనే కుక్కను ఎత్తుకుని, "రండి" అంటూ వెనక్కి తిరిగింది.

వాసు ధైర్యంగా గేటు తలుపుతీసి ముందుకెళ్ళాడు. ఆమె మెట్లపైన ఓ సారి వెను తిరిగి, ఎదురుగా వున్న గుమ్మం వేపు చూపిస్తూ, "డ్రాయింగ్ రూంలో కూచోండి" అని కుడి వేపుగా వెళ్ళిపోయింది.

గుమ్మానికి వేసి వున్న సన్నని పరదాను తొలిగించి, గదిలోకి అడుగు పెట్టాడు వాసు. మెత్తని తివాసి పరచివుంది. ఎదురుగా సోఫా సెట్టు, ఎడమ ప్రక్కన ఒక తఖత్ (బల్ల), దాని మీద తెల్లని దుప్పటి, పొడుగాటి గుండ్రని దిండూ వున్నాయి. దాని ప్రక్కనే రేడియోగ్రాం వుంది. గదిలో మరోనాలుగు కుర్చీలూ వున్నాయి. పైన సీలింగ్ ఫాన్. దానికి నాలుగు వేపులా ఫానూస్ (షాండిలియర్స్) వేలాడుతున్నాయి. కుడి వేపు నున్న గుమ్మానికి రంగు రంగుల పరదా వేసివుంది.

ఈ అట్టహాసాన్నంతాచూసి, దిగ్భ్రాంతితో కాసేపు నిలుచుండి పోయాడు వాసు. తిన్నగా వెళ్ళి ఒక కుర్చీపైన అంటీ అంటునట్టు కూచున్నాడు.

ఏమిటీ వింత?... ఖాసింకు ఎంత అదృష్టం పట్టింది?

ఇందాక కనిపించినావిడ ఎవరు?... తల్లా? ... ఉహుఁ, కాదు. ఖాసింతల్లి తనకు బాగా గుర్తు. చిన్నప్పుడు చాలాసార్లు చూశాడు. మాసిపోయిన తెల్ల కమీజూ రంగు వెలసిన చీరా, పొట్టి జడా, చేతులకు మట్టి గాజులూ, చెవులకు మూడు నాలుగు వెండి దుద్దులూ, పాలిపోయిన తెల్లని కోల మొహం... బాగా గుర్తున్నాయి. చిన్నప్పుడు అందంగానే వుండేమో, కాని ఆ అందాన్నంతా ఒకే ఒక్క సంతానం, ఖాసింకు ధారపోసి, క్షేమదేవతలా కనిపించేది... ఆమె ఈమె కాదు. మరి ఈమె ఎవరో... ?

ఇంతలో కుడి గుమ్మం పరదా తొలిగింది. ఖాసిం కనిపించాడు. భుజాల పైనా, మెడకు సగిషీలు వేసిన సిల్కు కుర్తా,తెల్లని పైజామా వేసుకున్నాడు.

లేచి నిల్చున్నాడు వాసు.

"హల్లో వాసూ!" అంటూ నవ్వుముఖంతో ముందుకొచ్చి వాసును వాటేసుకున్నాడు.

"అబ్బ! మనం విడిపోయి పదేళ్ళు అవుతుంది కదూ?... ఊఁ, చెప్పు, ఎక్కడ దాక్కున్నావు ఇన్నాళ్ళు ?ఆఖరికి ఆ హోటల్లో అవతరించావా?"

".. నీకు జ్ఞాపకముందా ఖాసిం?"

"ఏఁవిటి?"

"చిన్నప్పుడు ఓమాటు నువ్వు నన్నడిగావు, పెద్దయాక నేనేఁ చెయ్య దలచుకున్నానని"

"...ఏమో, జ్ఞాపకంలేదు. నువ్వే మన్నావు?"

"... మానవసేవ అన్నాను. ఇప్పుడు నేనా హోటల్‌లో చేసేది అదేనేమో..."

పెద్దగా నవ్వాడు ఖాసిం."భలేవాడివే... అదంతా కాదు, నీ కథంతా చెప్పు. ఈ రెండు రోజుల్నించి ఆసక్తిగా వేచి వున్నాను"అంటూ వాసు చేతులు పట్టుకున్నాడు.

"ఏముందీ, మామూలే. " అంటూ, తన పదేళ్ళ చరిత్ర సవిస్తరంగా చెప్పుకొచ్చాడు వాసు. శ్రద్ధగా వింటూ కూచున్నాడు ఖాసిం. ఆఖరికి ఓ నిట్టూర్పు విడిచి "నిజంగా నువ్వు అదృష్టవంతుడివి వాసూ!". అన్నాడు.

వాసు చకితుడైనాడు. 'నేనా...? ...అదృష్టవంతుణ్ణా... ?" అంటూ నోరువెళ్లబెట్టాడు.

వాసు ఆ ఆశ్చర్యాన్నించి తేరుకోకముందే, గదిలోకి అడుగుపెట్టింది ఓ పదేళ్ళ పనిపిల్ల. చేతిలో ఓ పెద్ద ట్రేవుంది. సోఫాముందున్న టీపాయ్ మీద పెట్టి లోపలికెళ్ళిపోయింది.

ట్రే మైనకప్పివున్న అల్లిక తువాలు తొలగించాడు ఖాసిం. ప్లేట్లలో బిస్కెట్లూ, పేస్ట్రీ, కలీపప్పూ, నీళ్ళగ్లాసులూ వున్నాయి. వాటిలో ఒక్కొక్క ప్లేటేతీసి వాసుచేత బలవంతాన తినిపించటం మొదలుపెట్టాడు ఖాసిం.

పనిపిల్ల మళ్ళీవచ్చి మరో ట్రే పెట్టి పోయింది. అందులో మఖమల్ టోపీ తొడిగిన టీపాట్, మిల్క్‌పాట్, షుగర్‌బౌల్, కప్పు సాసర్లూ వున్నాయి. ఖాసిం రెండు కప్పుల్లో టీ తయారుచేసి, ఒకటి వాసుకు అందించి, తానొకటి తీసికుని, వెనక్కు వొరిగాడు.

ఇద్దరూ టీ సిప్‌చేస్తూ కాసేపు మౌనంగానే కూచున్నారు. ఆఖరికి వాసే అందుకున్నాడు. "ఖాసిం! ఇందాక నువ్వు నన్ను అదృష్టవంతుడి వన్నావు. అలా ఎందుకన్నావో నాకు అంతుపట్టటంలేదు".

"...అలా ఎందుకన్నానో తర్వాత చెబుతాను. ముందు ఓ కథవిను"

"కథా ?"

"అవును, కథే... ఓ దురదృష్టవంతుడి కథ".

పనిపిల్ల వచ్చి ట్రేలు తీసికెళ్ళింది.

ఖాసిం జేబులోంచి సిగరెట్‌పెట్టి తీసి వాసుకు అందివ్వబోయాడు. వాసు తాగనన్నాడు. ఖాసిం ఒక సిగరెట్టుతీసి, కాల్చి, పీల్చి, ఉంగరాల పొగవదులుతూ, మెల్లిగా చెప్పుకుపోయాడు.

"పూర్వం హైదరాబాదు రాష్ట్రంలో ఒక నవాబు వుండేవాడు. అతని పేరు నవాబు మజీదుల్లా. తాలుక్‌దార్ (కలెక్టర్)గా పని చేసేవాడు. బాగా ఆస్తిపరుడు. సాధారణంగా నవాబులకుండే అలవాట్లన్నీ ఆయనకీ వుండేవి.

వేటా, జూదమూ, తాగుడూ, స్త్రీ లోలత్వమూ అన్నింట్లోనూ ఆరితేరినవాడు. ఒకరితర్వాత ఒకరు ఇద్దరు భార్యల్ని పెళ్ళిచేసుకున్నాడు. కాని ఇద్దరికీ సంతానం కలుగలేదు. సంతాన హీనంగానే ఇద్దరూ చనిపోయారు. ఆ తర్వాత చాలాకాలానికి, మూడోభార్యను చేసుకున్నాడు. ఆమెకీ ఆయనకీ దాదాపు పాతికేళ్ళతేడా. ఆమెకూ పిల్లలు పుట్టలేదు. నవాబుగారి ఆఫీసులో ఒక సర్రాఫ్ (కాషియర్) వుండేవాడు. ఖజానా (ట్రెజరీ) నించి డబ్బుతెచ్చి మహాసిబ్ (అకౌంటెంట్)కు అప్పజెప్పడం అతని విధుల్లో ఒకటి. ఎలా అబ్బిందో ఏమోగాని, అతను రేసుగుర్రాల వ్యసనంలో పడ్డాడు... ఒక రోజు ఖజానానించి పదివేలరూపాయలు తీసుకుని, ఆఫీసుకు రాకుండా ఎటో పారిపోయాడు. ఆ విషయం తెలియగానే తాలుక్‌దార్‌గారు పోలీసులకు రిపోర్ట్ ఇచ్చారు. గాలించి, పట్టేసి బంధించారు. అది వినగానే సర్రాఫ్ భార్య లబోదిబోమంటూ, కొడుకుని వెంటేసుకుని వెళ్ళి నవాబుగారి సతీమణి కాళ్ళమీద పడ్డది. ఆమెకు జాలివేసి, భర్తకు సిఫారసుచేసింది. కాని ఆయన ఏం చెయ్యలేనని ఖచ్చితంగా చెప్పేశాడు. సర్రాఫ్‌భార్య నేరుగావెళ్ళి ఆయన ముందరే మోకరిల్లింది. సర్రాఫ్ భార్య కాస్త అందంగా వుంటుంది. నవాబుగారి చిత్తం చలించింది. 'సరేలే, చూద్దాం' అని పంపించివేశారు. రెండో రోజు రాత్రి, నవాబుగారి కారు సర్రాఫ్ ఇంటికెళ్ళింది. అందులో డ్రైవరూ, ఒక చప్రాసీ (బంట్రోతు) మాత్రమే వున్నారు. సర్రాఫ్ భార్యతో అన్నారు "నవాబుగారు సర్రాఫ్‌ని విడిపించి తెచ్చారు. నిన్ను రమ్మంటున్నారు" అని. సర్రాఫ్ భార్య సంతోషంగా బయలుదేరింది. నిద్రలో వున్న కొడుకును లేపబోతే, "వద్దు, లేపకు. ఇప్పుడే నువ్వూ నీ భర్తా తిరిగి వచ్చేద్దురుగాని, రా" అంటూ తీసికెళ్ళి కార్లో కూచోబెట్టారు. కారు తిన్నగా పట్నానికి పది మైళ్ళ దూరాన, జీడిమెట్ల చెరువుగట్టుమీద వున్న రహదారి బంగళాకు చేరుకుంది. అక్కడ బాగా కైపులోవున్న నవాబుగారు, పులిలా పొంచివున్నారు. విషయం అర్థమైన ఆ ఇల్లాలు కేకలూ, బొబ్బలూ పెట్టింది. కాని ఆ అడవిలో

ఆమె ఆర్తనాదం వినేవాళ్ళెవరు ? ఆమె శీలం పశుబలానికి ఆహుతి అయిపో
యింది. అర్ధరాత్రి తీసికెళ్ళి ఇంటిదగ్గిర వదిలేసి వచ్చింది కారు. ఇంకా
అమాయకంగా నిద్రపోతున్న కొడుకును చూడగానే ఆ తల్లిగుండెలు బ్రద్ద
లైనాయి. వెంటనే చేతిగాజులు చూర్ణంగా దంచి, నీళ్ళలో కలుపుకుని తాగేసి
కొడుకు ప్రక్కనే పడుకుంది. తెల్లారేసరికి శవంగా మిగిలింది. బందీలోవున్న
సర్రాఫ్ తల్లడిల్లిపోయాడు. కాపలా పోలీసు చేతిలోని బందూక్ (తుపాకి)
లాక్కొని, గుండెకు గురిపెట్టి కాల్చుకొని అక్కడికక్కడే చచ్చిపోయాడు
దాంతో సర్రాఫ్ కొడుకు అనాథ అయిపోయాడు" అని ఖాసిం ఆగాడు.

కుతూహలంగా వింటోన్న వాసు, ఆగలేక, "మరి నవాబుగారికేం
కాలేదా?" అన్నాడు.

"ఏమవుతుంది? ఆయన పలుకుబడిగల పెద్ద మనిషి. అసలు సంగతి
ఎలా బయట పడుతుంది? భర్త చేసినపని భరించలేక భార్యా, భార్యమరణం
భరించలేక భర్తా ఆత్మహత్య చేసుకున్నారందరూ... కాని అంతటితో ఆగిపో
లేదు. కొన్నాళ్ళకు, డ్రైవర్ద్వారా, చప్రాసీద్వారా నిజం తెలిసిపోయింది
నవాబుగారిభార్య బేగంసాబుకు. ఆమెకు చాలా బాధ కలిగింది. ఉగ్రురాలైంది.
భర్తను నానా చీవాట్లు వేసింది. పెద్ద రభసే లేవనెత్తింది. నవాబుగారు
తట్టుకోలేక వేటకు ఉడాయించారు. అక్కడ ఏం అజాగ్రత్త జరిగిందో ఏమో
పులివాత పడ్డారు. ఎముకలుకూడా చిక్కలేదు. దాంతో బేగంసాబ్ విధవరా
లైంది. ఆమెది జాలిగుండె. సర్రాఫ్ కొడుకుని రప్పించి తనదగ్గిరే పెట్టు
కుని పెంచటం మొదలెట్టింది. బేగంసాబ్ సంతాన హీనురాలుగాబట్టి నవాబు
గారి ఆస్తికంతకూ ఏకైక వారసురాలు కాలేకపోయింది. ఆయన అన్నదమ్ము
లతో పంచుకోవాలిసి వచ్చింది. అయినా, నవాబుగారు బ్రతికుండగా తన
పేరిట రాయించివున్న బంగళా, తన వొంటిమీదవున్న జవ్హారీ, పెళ్ళినాడు
రాయించిన 'మొహర్' (భరణం) కింది ఒక లక్షరూపాయలూ, విధవగా

తన వాటా కలసి కొన్ని లక్షలు చేసే ఆస్తి మిగిలింది. అదికూడా తన తదనంతరం భర్త పరివారానికే చెందుతుందన్న బెంగపట్టుకుంది. అలా జరగటం ఆమెకు ఎంతమాత్రం ఇష్టంలేదు. ఆ ముసలాడికి అంటగట్టి, తన జీవితంతో చెలగాటం ఆడారని ఇటు పుట్టింటివారిమీదా, అటు మెట్టినింటివారి మీదా ఆమెకొక కక్ష. వాళ్ళెవరికీ ఒక్క చిల్లిగవ్వ కూడా దక్కకూడదు. అంతా, తనకు ప్రాణప్రదమైన సర్రాఫ్‌కొడుక్కే చెందాలని ఆమె అభిలాష. అందుకుగాను ఆమె ఒక అపూర్వమైన అడుగు వేసింది" అని ఖాసిం ఆగి పోయాడు.

ఉత్సుకత అపుకోలేక ఆత్రంగా అడిగాడువాసు, "ఏం చేసింది ?... ఆ కుర్రాణ్ణి దత్తత చేసుకుని వుంటుంది. అంతేనా ?"

క్షణం ఆగి ఖాసిం మెల్లిగా అన్నాడు "కాదు, దత్తత మా మతంలో లేదు. అంతకంటే కట్టుదిట్టమైన పని చేసింది... వాడిని పెళ్ళాడింది".

"పెళ్ళా ? ?..." ఎగిరిపడ్డాడు వాసు.

"...అవును, పెళ్ళే".

"కాని...కాని వాళ్ళ వయసు... ?"

"ఆమె పెద్దదే. కాని ఏమంత పెద్దదికాదు. తేడా పన్నెండేళ్ళే .. ఏం, అది మీ మతంలో నిషిద్ధమా ?"

"ఏమో, నాకు తెలీదు. కాని ఎక్కడా కనీ వినీ ఎరుగను."

"నేనూ ఎరుగను. కాని, మా మతంలో నిషిద్ధంకాదు. మా మత గురువు మొదటిభార్య ఆయనకంటే పదిహేనేళ్ళు పెద్దది. పెళ్ళినాటికి ఆమె కూడా వితంతువే".

వాసు నోటమాటరాలేదు. చాలా సేపటికి తేరుకుని, "ఖాసిం! ఇంతకూ ఈ కథంతా నాకెందుకు చెబుతున్నావు ?" అన్నాడు.

ఖాసిం పేలవంగా నవ్వి, "నీకింకా అర్థం కాలేదా వాసూ? .. ఆ అనాథ బాలుడు మరెవరో కాదు, నేనే. ఇందాక నువ్వు చూశావే ఆమే ఆ జాలి గుండెగల బేగంసాబ్".

వాసు అదిరిపడ్డాడు. ''నిజంగానా ? ఆమె నీ భార్యా... ?"

ఖాసిం జవాబు చెప్పలేదు. వాసు చేతిని తన చేతుల్లోకి తీసుకుని అడిగాడు, ''ఇప్పుడు చెప్పు వాసూ! అదృష్టవంతుడివి నువ్వా, నేనా ?"

వాసు మారు మాటాడకండా, ఖాసిం కళ్ళల్లోకి, కళ్ళచుట్టూ ఏర్పడుతోన్న నల్లటి చారలకేసీ చూస్తూ వుండిపోయాడు.

(అముద్రితం)